
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 10 నవంబరు 2025 | 5




హత్యకు గురైన బాలిక

పాపం.. ఏం చేసిందని!

- తెలిసినవాడిగా ఇంట్లో చేరిన నిందితుడు
- కొన్నాళ్లుగా నగదు, బంగారంపై కన్ను
- చోరీని బాలిక గమనించడంతో హత్య
- పోలీసులకు పట్టించిన అతి ప్రవర్తన


సిర్రా రంజిత(ఫైల్ ఫొటో)

ఎవరిని నమ్మాలో.. ఎవరిని నమ్మకూడదో కూడా తెలియడం లేదు.. నమ్మితే నట్టేట ముంచేసే వాళ్లు.. మన చుట్టూనే తిరుగుతున్నారు.. రామచంద్రపురంలో ఇదే జరిగింది.. ఇంట్లో నమ్మకంగాఉన్న వ్యక్తి పాపం.. ఏంచేసిందని.. ఏం చూసిందనేది ఆలోచించకుండా పదేళ్ల చిన్నారిని పొట్టన పెట్టుకున్నాడో క్రూరుడు.. చున్నీని బాలిక మెడకు చుట్టి.. ఆమెను మంచంపైకి తోసి ముఖాన్ని నొక్కి అదిమిపట్టి హత్యచేశాడు. తనపై ఎవరికీ అనుమానం రాకుండా బాలిక మృతదేహాన్ని ఫ్యాన్‌కు ఉరితీసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ఇదంతా చేసిందెవరో తెలిసి పోలీసులే అవాక్కయ్యారు. ఆ కుటుంబానికి పరిచయమున్న వ్యక్తి.. బాలిక తల్లిని అక్కా అని పిలిచేవాడే ఈ పాపానికి ఒడిగట్టాడు.. రామచంద్రపురం మండలం అంబికపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన పెయ్యల శ్రీనివాస్ ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడు. బాలిక తల్లిదండ్రులకు తొలుత అలాగే పరిచమయ్యాడు. ఇంట్లో ఎలక్ట్రికల్ సమస్య ఏదున్నా అతనికే చెప్పేవారు. వచ్చి చేసి వెళ్లిపోయేవాడు. ఆ ఇంట్లో సొంతవాడిలా మెలుగుతున్నాడు.. ఏ పని ఉన్నా వాడికే ఫోన్ చేసేలా మారిపోయాడు. అలా ఆనుపానులు చూసుకున్నాడు. బంగారం, డబ్బు దొంగిలించాలన్న దుర్బుద్ధితో ఈనెల 4న ఆ ఇంట్లోకి వెళ్లాడు. ఇంట్లో ఉన్న చిన్నారి తన చోరీ యత్నాన్ని పసిగట్టిందన్న భయంతో కర్కశంగా చంపేశాడు. బాలిక మృతదేహం పక్కనే నిలబడి కన్నీటి పర్యంతమయ్యాడు. తన నట విశ్వరూపం చూపాడు. బాలిక మృతికి తాను బాధపడుతున్నట్టుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. బాలిక మరణించిన తర్వాత రోజు తల్లిదండ్రులు మీడియాతో మాట్లాడుతుంటే వారి పక్కనే ఉన్నాడు. ఎక్కడా ఎవరికీ చిక్కకుండా తప్పించుకున్న నిందితుడు అతి ప్రవర్తనతో పోలీసులకు దొరికిపోయాడు. అంతే అతడి పాపం పండిపోయింది.. పెయ్యల శ్రీనివాస్‌ను తొలుత పోలీసులు నిందితుడిగా అనుమానించలేదు. క్లూస్‌టీం వేలిముద్రలు సేకరిస్తుండగా వారితో అతిగా ప్రవర్తించినట్టు సమాచారం. దీంతో క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్‌కు అనుమానం వచ్చి అతడి వేలిముద్రలు తీసుకున్నారు. అదే దర్యాప్తులో కీలకంగా మారింది. శ్రీనివాస్ వేలిముద్రలు సరిపోవడంతో ఆదివారం పోలీసులు దీన్ని హత్యగా తేల్చారు. తల్లి లేని సమయంలో ఇంట్లోకి ప్రవేశించి చోరీకి యత్నించి.. బాలికను హత్య చేసి ఏమీ తెలియనట్టుగా ఉరివేసి వెళ్లిపోయాడని తేల్చారు. ఇది తెలియడంతో బాలిక తల్లిదండ్రులు ఘొల్లుమన్నారు. పాపను ఇలా చంపేస్తాడనుకోలేదని కన్నీటి పర్యంతమయ్యారు. వాడిని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. హత్యకేసును నాలుగురోజుల్లో ఛేదించిన డీఎస్పీ రఘువీర్, సీఐలు నారాయణ, దొరరాజు, ఎస్ఐలు నాగేశ్వరరావు, లక్ష్మణ్, జానీబాషా, సురేష్‌బాబు, అంగర హరీష్‌లతోపాటు ఫింగర్ ప్రింట్ బ్యూరో అమలాపురం ఇన్‌స్పెక్టర్ కె.ప్రవీణ్‌కుమార్, వారి బృందం సభ్యులను జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా అభినందించారు.

- ద్రాక్షారామ(రామచంద్రపురం)-ఆంధ్రజ్యోతి

పూర్తి వివరాలు మెయిన్‌లో..



ఆపేదెవరు.. భైరవా..

భౌబోయ్.. బతకనివ్వడంలేదు!

ఎక్కడపడితే అక్కడ కుక్కలు.. అందుగలవు.. ఇందులేవని సందేహం వలదు.. ఎటు చూసినా కుక్కలే.. ఏ వీధి చూసినా కుక్కల గుంపులే.. ఎంతలా అంటే ఏ వీధిలో అడుగుపెట్టాలన్నా భయపడేంతగా కుక్కలు పెరిగిపోయాయి.. బడి..గుడి.. ఆసుపత్రి.. బస్టాండ్.. రైల్వే స్టేషన్..క్రీడాప్రాంగణాలు ఎక్కడ చూసినా అవే.. జనసమ్మర్ధ ప్రాంతాల్లో కుక్కలు కనబడ కూడదని సాక్షాత్తూ సుప్రీం కోర్టు ఆదేశించినా తీరులో మార్పేమి లేదు.. అవి యథేచ్ఛగా తిరుగుతూనే ఉన్నాయి.. అధికారులు చూస్తూనే ఉన్నారు.. కుక్కలు తరుముతుంటే జనం బౌబోయ్ అంటూ పరుగులు పెడుతున్నారు.. ఇకనైనా అధికా రులు దృష్టి పెట్టి కుక్కల నివారణ చర్యలు చేపట్టాల్సిందే మరి..

- (రాజమహేంద్రవరం/ కాకినాడ/ అమలాపురం రూరల్- ఆంధ్రజ్యోతి)

- ఉమ్మడి జిల్లాలో లక్షకుపైనే గ్రామ సింహాలు
- పెరిగిపోతున్న కుక్కల సంతతి
- ఆసుపత్రులకు కుక్కకాటు బాధితుల క్యూ
- తూతూ మంత్రంగా ఏబీసీ ఆపరేషన్లు
- సుప్రీం కోర్టు ఆదేశించినా కానరాని కదలిక

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పట్టణం,గ్రామం అనే తేడా లేకుండా రాత్రి వేళ అధికారులను ఏ వీధిలోకి పంపించినా కుక్కలకు బందీ లవు తారు. వీధుల్లో ఎక్కడ చూసినా వీధి కుక్కలు జనం పిక్కలు లాగేయడానికి సిద్ధంగా ఉంటున్నాయి. అవి దయతలిస్తేనే రోడ్డుపై జనం సంచరించే పరిస్థితు లు ఉన్నాయంటే అబద్ధం కాదు. కుక్క కరవకుండా ఇంటికి చేరుకున్నామంటే అదృష్టంగానే భావించాల్సి వస్తోంది. ఎక్కడ చూసినా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి.పిల్లలను బయటకు పంపడానికి తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు.రాజమండ్రి రైల్వేస్టేషనల్లో కుక్కలను తప్పించుకొని వెళ్లే కంగారులో ప్రమాదాలు జరుగు తున్నాయి.పిల్లల చేతిలో ఏమైనా తిను బండారాలు ఉంటే వాటిపైకి ఇసురుగా వచ్చి లాక్కోవడంతో పాటు పిల్లలపై దాడి చేయడానికి యత్నిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం కన్నెర్ర చేసే వరకూ పరిస్థితి వెళ్లింది.ఇప్పటికైనా భౌబోయ్ భయం తగ్గుతుందేమో అని జనం చర్చించుకుంటున్నారు.

పెంచేసిన..కరోనా

కరోనా విపత్తు 2019, 2020,2021, 2022లో ఏబీసీ ఆపేయడంతో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిందని చెబుతున్నారు.2023, 2024లో ఆ సంఖ్యను అదుపులోకి తీసుకురావడానికి సీరియస్‌గా యాక్షన్‌లోకి దిగలేదు. పంచాయతీల్లో ఏబీసీలు లేకపో వడంతో ఆయా ప్రాంతాల్లోని కుక్కలను తీసుకొచ్చి నగర శివార్లలో వదిలేస్తున్నారు. కుక్కలకు డిసెంబరు, జనవరి నెలల్లో బ్రీడింగ్ సమయం. ఒక్కో కుక్కకు ఒక ఈతలో 4 నుంచి 8 పిల్లలు పుడుతుంటాయి.



సుప్రీం ఆదేశాలు అమలయ్యేనా?

వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అలాగే ఏబీసీ తర్వాత మళ్లీ అదే ప్రాంతంలో వదలొద్దని ఆదేశించింది. కానీ ఈ రెండిటిపై కార్యాచరణ ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటి వరకూ జిల్లాలో కుక్కల షెల్టర్లు లేవు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఏబీసీ తర్వాత ఎక్కడ వదిలి పెట్టాలనే అంశం కూడా కీలకం కానుంది. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, క్రీడా ప్రాంగణాలు, ఆస్పత్రులు, విద్యా సంస్థలు, జన సమ్మర్ద ప్రాం తాల్లో వీధి కుక్కల జాడ ఉండడానికి వీల్లేదని సుప్రీం చెప్పింది. విద్యా సంస్థల వద్ద కుక్కలు రాకుండా ఏర్పాట్లు ఉన్నా.. మిగతా చోట్ల నియం త్రించడంపై చిత్తశుద్ధి అవసరంగా కనిపిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించడం చాలా కష్టమనే ప్రచారం సాగుతోంది. వీధికుక్కలను పట్టుకుని ఒక చోట చేర్చడం ఓ పెద్ద ప్రహసనమే అంటున్నారు. అన్ని కుక్కల ఆలనాపాలనా చూ డాలంటే తలకుమించిన భారమవుతోందని చెబుతు న్నారు.ఈ క్రమంలో సుప్రీం ఆదేశాలపై అధికారులు కార్యాచరణ రూపొందించాల్సి ఉంది.



ఏబీసీ పని చేస్తోందా!

కుక్కల సంఖ్య నియంత్రణకు యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) శస్త్రచికిత్సలు చేస్తుంటారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో రోజుకు ప్రస్తుతం 25 వరకూ ఏబీసీ చేస్తున్నామని చెబుతున్నారు.ఒక్కో కుక్కకు రూ.1500 చొప్పున కార్పొరేషన్ ఖర్చుచేస్తోంది. కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు రాజమహేంద్రవరం కార్పొ రేషన్‌కే పరిమితమైంది. దీని పైనా పర్యవేక్షణ లేదు..ఏ రోజు ఏం చేశారనే నిఘా లేదు. కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల్లో పట్టిం చుకోవడం లేదు. పంచాయతీల్లో ఏబీసీ చేయ డానికి నిధుల కేటాయింపు లేదు.ఏబీసీ ఆప రేషన్ చేసినా కొన్నింటికి ఫెయిలవుతున్నాయనే వాదన ఉంది. కాకి నాడ,కోనసీమలో ప్రైవేటుగా చేయిస్తున్నట్టు సమాచారం.

వెటర్నరీ చతికిల

జిల్లా వ్యాప్తంగా వెటర్నరీ ఉన్న ఆస్పత్రుల్లో సర్జరీలకు పరికరాలు అందుబాటులో ఉంటాయి. వెటర్నరీ డిస్పెన్సరీలు ఉంటాయి. ఎక్కడా వెటర్నరీ శాఖ ఏబీసీపై దృష్టి సారించడం లేదు.దీంతో పంచాయతీల్లో కుక్కల సంతతి విపరీతంగా వృద్ధి చెందుతోంది. గతంలో కలెక్టర్ ఆదేశాలతో రాజమహేంద్రవరం వెటర్నరీ ఆస్పత్రిలో ప్రతి ఆదివారం వీధి కుక్కలకు ఏబీసీ చేసేవారు. నిలిపివేశారు ఎందుకో మరి..

'తూర్పు'న 50 వేలు..

తూర్పుగోదావరి జిల్లాల్లో సుమారు 50 వేల గ్రామ సింహాలు ఉన్నట్టు అంచనా.రాజమహేంద్రవరం సిటీ పరిధిలోనే తక్కువలో తక్కువంటే 15 వేలు ఉంటాయి. శంభూనగర్‌లోనే కుక్కల సంఖ్య అధికం. అధికారులు మాత్రం బాగా తక్కువ చేసి చూపే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. రోజుకు కుక్కల నోటికి 100 మంది వరకూ చిక్కుతున్నారు. రాజమహేంద్రవరం సమగ్ర ప్రభుత్వ ఆస్పత్రికి రోజూ సుమారు 50 మంది కుక్క కాటు బాధితులు వస్తున్నారు.చికిత్స పొందుతున్న వాళ్లు మరో 50 మంది ఉంటున్నారు. ఈ లెక్కన రోజుకు 100కి పైగానే జనం కుక్కల బారిన పడుతున్నారు.

కాకినాడలో 37 వేలు

కాకినాడ జిల్లాలో 37 వేలు శునకాలు ఉన్నట్టు అంచనా. వాటిలో 15 వేలు కాకినాడ కార్పొరేషన్‌లోనే ఉన్నాయి.జిల్లాలో 2021లో కుక్క కాటు కేసులు 6031 నమోదు కాగా రేబిస్‌తో ఏడుగురు మృతిచెందారు. 2022లో 6364 కేసులు నమోదైతే ఆరుగురు మృతిచెందారు. 2023లో 4293 కేసులు నమోదైతే ఇద్దరు రేబిస్‌తో మృతి చెందారు.2024లో 5 వేల మంది, 2025లో 4 వేల మంది కుక్కకాటు బారిన పడ్డారు.కాకినాడ అధికారులు ఏబీసీ ఆపరేషన్లు ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా చేయిస్తున్నా సత్ఫలితాలనివ్వడంలేదనే ఆరోపణలున్నాయి.

'కోనసీమ'లో 30 వేలు

కోనసీమ జిల్లాలో పెంపుడు,వీధికుక్కలు 30 వేలు ఉంటాయని చెబుతున్నారు. ఒక్క అమలాపురంలోనే 5 వేలుపైనే వీధి కుక్కలు ఉంటాయని సమాచారం..జిల్లాలోని పీహెచ్‌సీల్లో రోజుకు 40 మంది వరకు కుక్క కాటు బాధితులు వైద్యం చేయించుకుంటున్నారు. జిల్లాలో 4 వేల కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇచ్చారు. అమలాపురంలో కుక్కలను పట్టుకునేందుకు కాంట్రాక్టర్‌ను నియమించినట్టు కమిషనర్ నిర్మల్‌కుమార్ తెలిపారు.


అమలాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పలువురికి కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వీరబాబు

సత్ప్రవర్తనతో జీవించండి

- నేరప్రవృత్తి కలిగిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చిన అధికారులు
- ఎస్పీ ఆదేశాలపై జిల్లావ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లలో అమలు

అమలాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నేరప్రవృత్తి కలిగిన వ్యక్తులు సత్ప్రవర్తనతో జీవించి నేరాలకు స్వస్తి పలికి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా విజ్ఞప్తిచేశారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లాలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం రౌడీషీటర్లు, నేరచరిత్రగల వారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమం జరిగింది. రౌడీషీటర్ల కార్యకలాపాలపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించినా, ప్రజలకు ఇబ్బంది కలిగించినా వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రౌడీషీట్‌ను రద్దు చేయడంతోపాటు మరింత కఠినంగా వ్యవహరిస్తామని పోలీసు అధికారులు హెచ్చరించారు. నేరాల వల్ల కలిగే పర్యావసానాలు, కుటుంబసభ్యులు ఎదుర్కొనే సమస్యల గురించి వారికి అవగాహన కల్పించారు. జీవితంలో సానుకూల మార్పులు తీసుకురావడానికి ఉన్న అవకాశాలు, ఉపాధి మార్గాలను ఆయా స్టేషన్ల పోలీసు అధికారులు వారికి వివరించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఓటరు జాబితాల క్రమబద్ధీకరణకు 'సర్'

- రేపటి నుంచి ఎలక్టోరల్ అధికారులు, సిబ్బందికి శిక్షణ

అమలాపురంరూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఓటరుజాబితాలను పక్కాగా రూపొందించేందుకు స్పెషల్‌ఇంటెన్సివ్ రివిజన్(సర్) కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం చేపట్టగా త్వరలోనే మన రాష్ట్రంలో కూడా సర్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లాలవారీగా ఈనెల 11నుంచి సర్ విధివిధానాలపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వ కార్యదర్శి, చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ వివేక్‌యాదవ్ ఉత్తర్వులు జారీచేశారు. ఈఆర్వోలుగా ఉన్న తహశీల్దార్లతోపాటు ఏఈఆర్వోలు, బీఎల్వోలు, ఎల్వోలు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇస్తారు. 2002లో ఓటరు జాబితాల క్రమబద్ధీకరణ చేపట్టారు. వాటి ఆధారంగానే సర్-2026 కార్యక్రమం చేపట్టనున్నారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఓటరు జాబితాల్లో ఎలా సవరణలుచేయాల్సి ఉంటుందో వివరిస్తారు. సర్‌లో భాగంగా ఇంటింటికీ తిరిగి ఓటర్ల సమాచారాన్ని సేకరించి సంబంధిత యాప్‌లో నమోదుచేస్తారు. దొంగ ఓటర్ల బెడదను నివారించేందుకు ఈ విధానం దోహదపడుతుందని భావిస్తున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడినప్పటికీ స్వగ్రామంలోనే ఓటరు గుర్తింపుకార్డులు పొందినవారు వారి నిర్ణయం ఆధారంగా ఓట్లు ఉంచడం, తొలగించడం చేస్తారు. సర్ తొలి దశలో భాగంగా ఈనెల 11 నుంచి శిక్షణ ఇవ్వనున్నారు. 11న అల్లూరి సీతారామరాజు జిల్లాతోపాటు పలు జిల్లాల సిబ్బందికి శిక్షణ ఇస్తారు. 12న కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలతోపాటు పలు జిల్లాలకు ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారు. 13, 14 తేదీల్లో రాష్ట్రంలోని ఇతర జిల్లాల సిబ్బందికి శిక్షణ ఇస్తారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మండల కేంద్రాల్లో ఉన్న వీడియో కాన్ఫరెన్స్ హాలులో పాల్గొని వీరంతా శిక్షణ పొందాల్సి ఉంటుందని వివేక్ యాదవ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కేంద్రమంత్రి ధర్మేంద్రప్రదాన్‌తో ఎంపీ హరీష్ భేటీ


బీహార్‌లో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌తో భేటీ అయిన మంత్రి లోకేశ్, ఎంపీ హరీష్

అమలాపురం,నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యాశాఖ మంత్రి బీహార్ ఎన్నికల ప్రచారకర్త ధర్మేంద్ర ప్రదాన్‌తో ఏపీ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి బీహార్‌లో ఆదివారం భేటీఅయ్యారు. మర్యాదపూర్వకంగా జరిగిన ఈ భేటీలో ఎంపీ పాల్గొన్నారు. బీహార్‌లో ఎన్‌డీఏ విజయం కోసం తీవ్రంగా కృషిచేసి మరోసారి అధికారంలోకి తీసుకవచ్చేలా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ చేస్తున్న నిర్మాణాత్మక కృషిని రాష్ట్ర మంత్రి లోకేశ్‌తో పాటు ఎంపీ హరీష్‌మాధుర్ అభినందించారు. బీహార్‌లో మళ్లీ ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని ఎంపీ హరీష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎస్పీ ఆధ్వర్యంలో సైక్లోథాన్ 5కే సైకిల్ ర్యాలీ

అమలాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అమలాపురం పట్టణంలో సైక్లోథాన్ 5కే సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయం నుంచి జెండా ఊపి ఎస్పీ ప్రారంభించారు. ఈ ర్యాలీ ఐదు కిలోమీటర్ల దూరం సాగింది. అమలాపురం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగి తిరిగి పేరూరు వై.జంక్షన్‌కు వెళ్లి అక్కడి నుంచి తిరిగి నల్లవంతెన సమీపంలో ఉన్న ఎస్పీ కార్యాలయానికి చేరుకోవడంతో ర్యాలీ ముగిసింది. ఆరోగ్య ప్రాముఖ్యతను చాటిచెప్పేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ఎస్పీ మీనా తెలిపారు. సైక్లోథాన్ ర్యాలీలో ఎస్పీతోపాటు అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, ఎస్బీ సీఐ పుల్లారావు, ఏఆర్ ఆర్ఐలు బ్రహ్మానందం, కోటేశ్వరరావు సైకిల్ తొక్కుతూ పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం వేగవంతమైన జీవన విధానంలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమన్నారు.


సైక్లోథాన్ ర్యాలీలో సైకిల్ తొక్కుతున్న ఎస్పీ రాహుల్ మీనా, ఇతర పోలీసులు

భీమేశ్వరాలయం దర్శన విరామ సమయంలో

స్వల్ప మార్పులు

- ఆర్‌జేసీ ఆదేశాలు

ద్రాక్షారామ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కార్తీకమాసంలో స్వామి నివేదనా సమయాల్లో స్వల్ప మార్పులు చేశారు.ఆదివారం నివేదన సమయంలో స్వామి దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసిన కొంతమంది భక్తులు దర్శనం ఆలస్యం కావడంతో దేవదాయ శాఖామంత్రికి ఫిర్యాదుచేశారు. మంత్రి ఆదేశాలతో దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ వి.త్రినాథరావు సాయంత్రం ఆలయానికి చేరుకున్నారు. నివేదనాసమయంలో భక్తులకు దర్శన విరామ సమయాలపై ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానీ, ఉత్సవ అధికారి కె.నాగేశ్వరరావు, జిల్లాదేవదాయశాఖ అధికారి వి.సత్యనారాయణ, అర్చకులతో సమావేశం నిర్వహించారు.మధ్యాహ్నం 12గంటలవరకు టిక్కెట్లు విక్రయించి ఒంటి గంటకు దర్శనాలు ముగించి ఆలయం ఖాళీ చేయించాలని, స్వామికి నివేదన తర్వాత తిరిగి మధ్యాహ్నం 2.30 గంటలకు ఆలయం తెరిచి దర్శనాలు కొనసాగించాలని ఆదేశాలు ఇచ్చారు.

రేపు కొత్తపేటలో కేంద్ర బృందం పర్యటన

అమలాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఈనెల 11న కేంద్ర ప్రభుత్వం నియమించిన అధికారిక బృందం పర్యటించనుంది. మొంథా తుఫాన్ ప్రభావం వల్ల జిల్లాలో సంభవించిన నష్టాలను అంచనా వేసేందుకు నలుగురు సభ్యుల అధికారుల బృందం ఈనెల 11న జిల్లాలో పర్యటించనుంది. ఈ బృందంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ కె.పొన్నుస్వామి, వాటర్ రిసోర్స్ మంత్రిత్వశాఖకు చెందిన డైరెక్టర్ శ్రీనివాసా బైరి, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆర్తీ సింగ్, మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలెప్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ మనోజ్‌కుమార్ మీనాలతో కూడిన బృందం ఈనెల 12న జిల్లాలో పర్యటిస్తుంది. రాజమహేంద్రవరం నుంచి బయలుదేరే బృందం ఆలమూరు మండలం పెనికేరుకు ఉదయం 9 గంటలకు చేరుకుని అక్కడ పంట నష్టాలను పరిశీలిస్తుంది. 9.45గంటలకు పెనికేరు నుంచి బయలుదేరి 10.15గంటల వరకు పలు ప్రాంతాల్లో పంట నష్టాలకు సంబంధించి ఫీల్డ్ విజిట్స్ చేయనున్నారు. అనంతరం నియోజకవర్గ కేంద్రమైన మద్దులమెరకలో దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలిస్తారు. అక్కడినుంచి 11.15గంటలకు ఈ బృందం అమరావతిలోని సెక్రటేరియట్‌కు బయల్దేరి వెళ్తుంది.

సింగపూర్‌లో విద్యావ్యవస్థ పరిశీలనకు.. సఖినేటిపల్లిలంక తెలుగు ఉపాధ్యాయురాలి ఎంపిక 7

వెంకన్న ఆలయాభివృద్ధికి కృషి చేస్తా
» వాడపల్లిలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పూజలు 7

కిక్కిరిసిన సత్యదేవుడి సన్నిధి 7

మనస్తాపంతో ఉరి వేసుకున్న బాలింత
» మండపేట మండలం ద్వారపూడి శివారు వేములపల్లిలో ఘటన 7

గోదావరిలో స్నానానికి దిగి విద్యార్థి మృతి
» కపిలేశ్వరపురం మండలం కేదార్లంక వద్ద ఘటన
» విద్యార్థిది స్వగ్రామం అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు 7

కన్నీటితో.. కన్నరుణం తీర్చుకున్న కూతురు 7

'లోవ'లో భక్తుల రద్దీ

రూ.2.43 లక్షల ఆదాయం

తుని రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఏర్పాటుచేసిన వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తిభోజనాలు చేశారు. ఆదివారం వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.2.43 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న తలుపులమ్మ


క్యూలో బారులుతీరిన భక్తులు

కిక్కిరిసిన సత్యదేవుడి సన్నిధి

భారీగా తరలివచ్చిన భక్తులు

9వేల వ్రతాలు

రూ.85 లక్షల ఆదాయం

అన్నవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి ఆదివారం భక్తజనసందోహంగా మారింది. వేకువజామున 2గంటల నుంచి సర్వదర్శనాలు, వ్రతాలు ప్రారంభించగా సాయంత్రం 4 గంటల వరకు నిరంతరాయంగా రద్దీ కొనసాగింది. ఒక దశలో క్యూలైన్లు, వ్రత మండపాలు కిక్కిరిసి నిండిపోవడంతో అధికారులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. వాహనాల పార్కింగ్‌తో గందరగోళ పరిస్థితులు రావడంతో ఎస్‌ఐ హరిబాబు కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలను కొండదిగువ కళాశాల మైదానంలో పార్కింగ్ చేయించి కొండ దిగువ నుంచి ఉచిత బస్సుసౌకర్యం కల్పించారు. సుమారు 90వేలమందిని స్వామిని దర్శించుకోగా సత్యదేవ నిత్యన్నదాన పథకం ద్వారా 25వేలమందికి ఉచిత పులిహోర పంపిణీ చేశారు. స్వామి వారి ప్రత్యేక దర్శనానికి 2 గంటలు, ఉచిత దర్శనానికి 3గంటల సమయం భక్తులు వేచిఉండాల్సి వచ్చింది. చైర్మన్ రోహిత్ దగ్గరుండి ఎటువంటి తోపులాటలు జరగకుండా పర్యవేక్షించారు. ఆదివారం ఒక్కరోజు 9వేల జంటలు సత్యదేవుడి వ్రతాలు ఆచరించుకోగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.85 లక్షలు ఆదాయం లభించింది. భక్తుల రద్దీతో అంత్రాలయం దర్శనం టిక్కెట్ల విక్రయాలు నిలుపుదల చేసి శీఘ్రదర్శనానికి పరిమితం చేశారు. దిగువభాగంలో ఉన్న యంత్రాలయం సాయంత్రం వరకు పూర్తిగా నిలిపివేశారు. ఈవో సుబ్బారావు సత్యగిరికొండ, వ్రత మండపాలలో తిరుగుతూ కమాండ్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షించారు. కాగా రత్నగిరిపై కార్తీక సోమవారం జరిగే కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ఆదివారం రాత్రే భారీ సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. వసతి గదులు సరిపడక ఆరుబయట విశ్రమించారు.




క్యూలో బారులు తీరి సత్యదేవుడి దర్శనానంతరం వస్తున్న భక్తులు

కన్నీటితో.. కన్నరుణం..

తీర్చుకున్న కూతురు


–కాట్రేనికోన (ఆంధ్రజ్యోతి)

డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గెద్దనపల్లి పంచాయతీ లచ్చిరాజుచెరువులో బడుగు వెంకటరమణ (48) అనారోగ్యంతో మృతిచెందాడు. అతడికి కొడుకులు లేరు. ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. భార్య అనారోగ్యంతో ఉంది. పెద్ద కూతురుకు పెళ్లయ్యింది. రెండో కుమార్తె శ్రావణి ఆదివారం తన తండ్రికి కన్నీటితో తలకొరివి పెట్టింది.

సింగపూర్‌లో విద్యావ్యవస్థ పరిశీలనకు తెలుగు టీచర్ ప్రభావతి

అంతర్వేది, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలంక జీఎంసీ బాలయోగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూలు అసిస్టెంట్, తెలుగు టీచర్‌గా పనిచేస్తున్న గుండేపల్లి ప్రభావతికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇటీవల లభించింది. ఏపీ ఎన్జీసీ స్టేట్ మోనిటరింగ్ అధికారిగా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. 2012నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్‌సీఈఆర్టీలో స్టేట్ రిసోర్సుపర్సన్‌గా అనేక కరదీపకలను రూపొందించడంలో పాల్గొన్నారు. ఎన్నో ఆర్థిక సహాయ సహకారాలు అందించారు. ఈనెల 27 నుంచి డిసెంబరు 2వరకు సింగపూర్‌లోని విద్యావ్యవస్థను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంపిస్తుదని ఆమె తెలిపారు. ఆమెను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, జిల్లా యంత్రాంగం అభినందించారు.


గుండేపల్లి ప్రభావతి

వెంకన్న ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

వాడపల్లిలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పూజలు


వాడపల్లి వెంకన్న ఆలయంలో అయ్యన్నపాత్రుడికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం,నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచి కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న శ్రీదేవి భూదేవి సమేత వాడపలి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. అర్చక బృందం పూర్ణకుంభంతో మేళతాళ మంగళవాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ నిర్వహించుకుని స్వామిని దర్శించుకున్నారు. వసంత మండపంలో వేద పండితుల ఆశీర్వచనం స్పీకర్ దంపతులతో పాటు కుటుంబ సభ్యులు అందుకున్నారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచంద్రరావు స్వామి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రం సమర్పించారు. అనంతరం విలేకర్లతో స్పీకర్ మాట్లాడుతూ స్వామివారు ఎంతో ప్రాచుర్యం పొందారని, కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ఖ్యాతిని అర్జించనడంతో దేశ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారన్నారు. తాను సామాన్య భక్తుడిలానే కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించుకున్నానన్నారు. క్షేత్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని, మరింత అభివృద్ధికి సహకారం అందిస్తానని ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందని, దీనికి అనుగుణంగా మహిళలతో ఆలయాల్లో రద్దీ పెరిగిందని మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే బండారు తనయుడు బండారు సంజీవ్, టీడీపీ మండలాధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, సర్పంచ్ కాయల జగన్నాథం, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎస్‌ఐ రాము, నాయకులు ఉన్నారు.

వరి కోత పనులకు వచ్చి...

విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి... మృతులు పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం వాసులు

గండేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రామయ్యమ్మపాలెం నుంచి సింగరంపాలెనికి ఆదివారం ఉదయం వరి కోత మిషన్‌ను ఐషర్ వ్యాన్ మీద తీసుకెళ్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్‌ఐ యువి శివ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఐషర్ వ్యాన్ పై వరి కోత మిషన్‌ను తరలిస్తుండగా దారి మధ్యలో 11కెవి విద్యుత్ వైర్లు తగిలి డ్రైవర్ గెడ్డం సందీప్ (20) షాక్‌తో మృతిచెందాడు. ముందు బండి మీద వెళుతున్న మిషన్ యజమాని కరిపెట్టి సింహాద్రి అప్పన్న (53) వెనక్కి వచ్చి ఏమయిందోనని ఆందోళనతో వ్యాన్‌ను ముట్టుకోగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతిచెందిన ఇద్దరు పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం పేకేరు, రాపాక గ్రామాలకు చెందినవారు. వరి కోత పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చినట్టు పోలీసులు తెలిపారు. డ్రైవర్ ఎడమ వైపునకు రావడంతో మిషన్ పైన గొట్టం విద్యుత్ వైర్లకు తగిలి విద్యుత్ సరఫరా అయినట్టు తెలిపారు. మృతదేహాలను అంబులెన్స్‌లో మార్చురీకి తరలించామన్నారు. రైతుల మోటార్లకు త్రి ఫేస్ విద్యుత్తు సరఫరా ఉండడం వల్ల ఈ దుర్ఘటన జరిగిందన్నారు. సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ శివ నాగబాబు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.


మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ


సందీప్, సింహాద్రి (ఫైల్)



అంతర్ జిల్లాల జూడో చాంపియన్ 'అనంతపురం'

బాల, బాలికల విభాగాల్లో సత్తా చాటిన క్రీడాకారులు

సర్పవరం జంక్షన్, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): అంతర్ జిల్లాల జూడో చాంపియన్లుగా అనంతపురం జిల్లాకు చెందిన బాల, బాలికల జట్లు నిలిచాయి. రాష్ట్ర అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జూడో చాంపియన్‌షిప్ అండర్-17 పోటీలు రెండు రోజులుగా కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో హోరాహోరీగా సాగాయి. ఫైనల్ పోటీలు ఆదివారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వాకలపూడి హైస్కూలు క్రీడా ప్రాంగణంలో రసవత్తరంగా జరిగాయి. బాల, బాలికల విభాగాల్లో అనంతపురం జట్లు ఓవరాల్ చాంపియన్లుగా నిలిచాయి. విజేతలకు కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సతీష్, కాకినాడ రూరల్ ఎంఈవో-1 తుమ్మల సత్యరంగారావు, ఎంఈవో-2 శ్రీనివాస్‌కుమార్, జూడో సంఘ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ బహుమతులను ప్రదానం చేశారు. బాలుర విభాగంలో కృష్ణా (ద్వితీయ), కర్నూలు (తృతీయ), బాలికల విభాగంలో చిత్తూరు (ద్వితీయ), గుంటూరు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. ఆయా జిల్లాల జట్ల క్రీడాకారులకు కూడా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ కె.శ్రీ నివాస్, పీఈటీల సంఘ కార్యదర్శి వి.మాచరిరావు, కోశాధికారి కె.నాగలింగేశ్వరరావు, రాష్ట్ర పరిశీలకుడు ప్రతాపరెడ్డి, రవి రాజు, గిరి, ప్రసాదరెడ్డి, మూర్తి, శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.


అనంతపురం బాలికల, బాలుర జట్లకు బహుమతులు అందజేస్తున్న అధికారులు



మనస్తాపంతో ఉరేసుకున్న బాలింత

మండపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌లో భర్త మాటలకు మనస్తాపానికి గురైన 4 నెలల బాలింత ఉరివేసుకుంది. మండపేట రూరల్ సీఐ పీతల దొర్రాజు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బోడసకుర్రుకు చెందిన మట్టా వేణు(28)కు ముమ్మిడివరం మండలం సోమిదేవరపాలెనికి చెందిన రేఖ(24)తో మూడేళ్లక్రితం వివాహం జరిగింది. మండపేట మండలం ద్వారపూడి శివారు వేములపల్లిలో ఉన్న కొబ్బరితోటలో కపాలదారుడిగా ఉంటున్న రేఖ తండ్రి నేదునూరు శ్రీను 4 నెలల క్రితం కూతురిని పురుడు కోసం రేఖ వేములపల్లికి తీసుకొచ్చాడు. రేఖకు మగ బిడ్డ పుట్టాడు. తర్వాత రోజూ తన భర్తతో ఫోన్‌లో మాట్లాడేది. శనివారం రాత్రి భర్తతో ఫోన్ మాట్లాడుతున్న సమయంలో వారి మధ్య మాటామాటా పెరిగింది. వేణు బోడసకుర్రులో ఇంటి నిర్మాణానికి భార్యను రూ.లక్ష తీసుకురమ్మని డిమాండ్ చేశాడు. తన తండ్రి వద్ద డబ్బు లేదని, కుటుంబ పరిస్థితి బాగాలేదని చెప్పింది. అయినా డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో తన కూమార్తె మనస్తానికి గురై శనివారం తెల్లవారుజామున పొలంలో ఉన్న పాకలో దూలానికి చీర కట్టి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. సంఘటనా స్థలాన్ని మండపేట రూరల్ సీఐ పి.దొర్రాజు, రూరల్ ఎస్‌ఐ సంఘటనా పరిశీలించారు. కేసు నమోదు చేశామని మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించామని సీఐ తెలిపారు. తల్లిని కోల్పోయిన నాలుగు నెలల బాబు పరిస్థితి దయనీయంగా మారింది.


రేఖ (ఫైల్)

బైక్‌లు ఢీకొని యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు


మృతిచెందిన బుజ్జి బాబు

వై.రామవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం చవిటిదిబ్బలు శివారులో ఆదివారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. పి.ఎర్రగొండకు చెందిన జల్లి బుజ్జిబాబు (19) సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. బుజ్జిబాబు అడ్డతీగల వైపు నుంచి పి.ఎర్రగొండ వస్తుండగా మరో ద్విచక్ర వాహనంలో గొడుగురాయికి చెందిన వీకా ఈశ్వర దొర, కురసం విశ్వతేజ అనే యువకులు ఎదురుగా వస్తున్నారు. వారిద్దరి కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్సులో వై.రామవరం ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేస్తున్నట్టు వైద్యుడు జీవన్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గోదావరిలో స్నానానికి దిగి పదోతరగతి విద్యార్థి మృతి

కపిలేశ్వరపురం/ అంబాజీపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక వద్ద ఆదివారం గోదావరిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు యువకుడు మృతిచెందాడు. అంగర ఎస్‌ఐ హరీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన నామాడి బన్ను (15) కేదార్లంక శివారు వీధివారిలంక ధనమ్మ మర్రి వద్దకు స్నేహితులతో కలిసి వచ్చాడు. అనంతరం గోదావరి నదిలో స్నానానికి ముగ్గురు స్నేహితులతో కలిసి దిగాడు. వారిలో బన్ను గల్లంతయ్యాడు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. విహారయాత్రకు వెళ్లిన బన్ను(15) గోదావరిలో మృతిచెందడంతో పుల్లేటికుర్రులో విషాదఛాయలు అలుముకున్నాయి. బన్ను పుల్లేటికుర్రు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. అతడి తండ్రి అబ్రహం ఆటో డ్రైవర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బన్ను పెద్ద కుమారుడు కాగా చిన్న కుమారుడు అభిషేక్ ఆరో తరగతి చదువుతున్నాడు.


బన్ను (ఫైల్)

వైఎంసీఏ ఆధ్వర్యంలో రీజనల్ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు


విజేతలకు షీల్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ) ఆధ్వర్యంలో రీజనల్ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. రీజనల్ స్థాయిలో 152 మంది క్రీడాకారులతో 14జట్లు పాల్గొన్నాయి. వైఎంసీఏ సౌత్ ఇండియా రీజియన్ చైర్మన్ డాక్టర్ టి.సుమన్‌త్యాగరాజ్, కార్యదర్శి రెవ ఎస్.ధనరాజ్, పూర్వపు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రోలాండ్ విలియమ్స్, అమలాపురం శాఖ అధ్యక్షుడు ఎం.బాలాస్వామి పర్యవేక్షణలో జరిగిన ఈపోటీలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా ప్రారంభించారు. జూనియర్, సీనియర్స్ విభాగంలో లీగ్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, కోచ్‌లు ఐ.భమేష్, కట్టా పురుషోత్తం పర్యవేక్షించారు.

విజేతగా రాజమహేంద్రవరం జట్టు..

సీనియర్స్ విభాగంలో 4 జట్లు, జూనియర్స్ విభాగంలో 8 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. పోటీల అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ సభకు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మెన్ విభాగంలో రాజమహేంద్రవరం జట్టు విన్నర్‌గా, యానాం జట్టు రన్నర్‌గా నిలిచింది. వైఎంసీఏ బాలయోగి స్టేడియం జట్టు తృతీయస్థానం సాధించింది. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో అంబాజీపేట జట్టు ప్రథమ, అమలాపురం జిల్లాపరిషత్ బాలికోన్నత జట్టు ద్వితీయ, అమలాపురం బాలుర ఉన్నత పాఠశాల జట్టు తృతీయ స్థానం సాధించారు. బాలుర విభాగంలో యానాం జట్టు ప్రథమ, అమలాపురం జట్టు ద్వితీయ, అంబాజీపేట జట్టు తృతీయ స్థానాలు సాధించగా విజేతలకు ఎమ్మెల్యే ఆనందరావు షీల్డులు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో యు.మణిప్రసాద్, గెల్లా కృపావరం, చిట్టి మోషేను, శాంతిప్రకాష్, ఎ.ప్రసన్న, గోపీరాజు పాల్గొన్నారు. అలాగే ముఖ్య అతిథులను దుశ్శాలువాలతో సత్కరించారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

పెట్రోల్ బంక్‌లో ఆయిల్ ట్యాంకర్ అన్‌లోడు చేస్తుండగా మంటలు

అదుపు చేసిన అగ్నిమాపక శాఖ సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ సమీపంలోని భారత పెట్రోల్ బంక్‌లో తృటిలో పెనుప్రమాదం తప్పింది. ఆదివారం పెట్రోల్ బంక్‌లోకి వెళ్లిన ఆయిల్‌ట్యాంకర్ నుంచి అండర్‌గ్రౌండ్‌లో ఉన్న ట్యాంకర్‌లోకి పెట్రోల్‌ను అన్‌లోడు చేస్తుండగా సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మంటలు చెలరేగాయి. దీంతో అక్కడి సిబ్బందితో పాటు పెట్రోల్ కోసం వచ్చిన వాహనదారులు పరుగులు తీశారు. దీంతో భయానక వాతవరణం ఏర్పడింది. ఒకరిద్దరు సిబ్బందిని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. బంక్ నిర్వాహకుల సమాచారంతో ఆర్యాపురం అగ్నిమాపక శాఖ ఫైరింజన్ సకాలంలో బంక్ వద్దకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఏ మాత్రం ఆలస్యమైనా పెనుప్రమాదం జరిగి భూగర్భంలో ఉన్న ఆయిల్‌ట్యాంక్‌లు పేలి చుట్టుపక్కల ప్రాంతాలు, వ్యాపార సంస్థలు తునాతునకలై ప్రాణనష్టం జరిగిఉండేది. ప్రమాదం తప్పి పెద్దగా ఆస్తినష్టం జరగలేదు.


పెట్రోల్ బంక్‌లో ఆయిల్ ట్యాంకర్ వద్ద చెలరేగుతున్న మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది



అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధం

రూ. 14 లక్షలకు పైగా ఆస్తినష్టం

అంబాజీపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడి పరిధిలోని తిరుమనాథంవారిపాలెం శివారులో ఆదివారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు తాటాకిల్లు దగ్ధం కాగా రూ.14 లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించింది. స్థానికులు వివరాలు ఇలా ఉన్నాయి. కె.పెదపూడి చెందిన ఈతకోట సుబ్బారావు, ఈతకోట శ్రీనివాసరావు, ఈతకోట ఈశ్వరరావు, ఈతకోట మంగాయమ్మకు చెందిన తాటాకిళ్ల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధం కాగా గృహోపకరణ వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. తొలుత సుబ్బారావు, శ్రీనివాసరావు ఉంటున్న తాటాకింటికి నిప్పటుంకోగా పక్కనేఉన్న ఈశ్వరరావు ఇంటికి మంటలు ఒక్కసారిగా వ్యాపించి రెండు ఇళ్లు కాలి బూడిదయ్యాయి. స్థలం కొనుగోలు కోసం దాచుకున్న సుబ్బారావుకు చెందిన నగదు రూ.1.50లక్షలు, 12 గ్రాముల బంగారం, అతడి కుమారుడి సర్టిఫికెట్లు, శ్రీనివాసరావుకు చెందిన రూ.2.50లక్షల నగదు, 18 గ్రాముల బంగారం, సర్టిఫికెట్లు, మంగాయమ్మకు చెందిన రూ.1.50 లక్షలు, బంగారం, ఈశ్వరరావుకు చెందిన రూ.2.70లక్షల నగదు, బంగారం గృహోపకరణ వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు.


అగ్నికి ఆహుతవుతున్న తాటాకిళ్లు

ఆ రోజులు మళ్లీరావు..

ఏడున్నర పదుల వయసులోనూ ఎంతో ఉత్సాహం

గొల్లప్రోలులో కలిసిన 1964-65 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

గొల్లప్రోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏడున్నర పదుల వయస్సులోనూ వారిలో ఉత్సాహం ఉరకలు వేసింది. ఆరు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న వీరంతా కార్తీకమాసంలో ఏటా కలుసుకుంటారు. చిన్ననాటి సంగతులు గుర్తుకు తెచ్చుకుంటూ కుటుంబాల విషయాలు చర్చించుకుంటూ నూతనోత్తేజం పొందుతారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1954-65 ఎస్ఎస్ఎల్‌సీ(టెన్త్) బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని డాక్టర్ మలిరెడ్డి వెంకట్రాజు మెమోరియల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వేదికగా కలుసుకున్నారు. వారు గత 26 ఏళ్లుగా ఏటా కార్తీకమాసంలో కలుసుకుంటున్నారు. ఆదివారం కలుసుకున్న వీరం తా చిన్ననాటి జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయారు. పిల్లలు మాదిరిగా నాడు తరగతి గదుల్లో చేసిన అల్లర్లు, చిలిపి పనులు, నాడు జరిగిన పోటీలు తదితర అంశాలను గుర్తుకు తెచ్చుకున్నారు. కుటుంబసభ్యులు వివరాలును పంచుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సరదాగా గడిపిన వీరంతా భారమెక్కిన హృదయాలతో పరస్పరం వీడ్కోలు చెప్పుకున్నారు. తొలుత 76మంది వరకూ ఉండగా ప్రస్తుతం 30 మంది కలుసుకున్నారు.


గొల్లప్రోలులో కలిసి అలనాటి సంగతులు పంచుకుంటున్న పూర్వ విద్యార్థులు



రాజేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పి.గన్నవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆరుద్రనక్షత్రం సందర్భంగా ముంగండలో ఉన్న శ్రీపార్వతి రాజేశ్వరస్వామి (బ్రహ్మసూత్ర లింగం) వారు ఆదివారం అర్ధనారీశ్వరస్వామిగా దర్శనమిచ్చారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా కార్తీక వనసమారాధనలు

అమలాపురంరూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సంఘీయులు ఐక్యతను చాటుతూ ఆదివారం పోటాపోటీగా కార్తీక వనసమారాధనలు నిర్వహించారు. ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. వయోబేధాన్ని మరిచి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. శాస్త్రోక్తంగా ఉసిరిక చెట్టు వద్ద పూజలు నిర్వహించారు. పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు.

అడపావారి ఆత్మీయ కలయిక..

ఈదరపల్లి అలవైకుంఠపురంలో ఆదివారం అడపా కుటుంబీకుల ఆత్మీయ కలయిక జరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో స్థిరపడ్డ అడపా కుటుంబీకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అడపావారి ట్రస్టు అధ్యక్షుడు అడపా శివయ్య అధ్యక్షతన ఈదరపల్లి యూత్ ఆధ్వర్యంలో అడపా భోగిరాజు కళావేదికపై ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. చదువుతో పాటు విభిన్న రంగాల్లో రాణిస్తున్న ప్రతిభావంతులను విద్యార్థులను సత్కరించారు. పేద విద్యార్థులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం జరిగిన కార్తీక వనసమారాధనలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడపా సుబ్రహ్మణ్యం, ట్రస్టు ఉపాధ్యక్షుడు అడపా బాబులు, అడపా రాజా, ప్రధాన కార్యదర్శి అడపా కల్యాణ్, గుంటూరుకు చెందిన అడపా మాణిక్యాలరావు, హైదరాబాద్ కాపుసంఘ నాయకుడు అడపా భాస్కరరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కరరావు, రాష్ట్ర డీలర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ అధ్యక్షుడు అడపా వెంకటరమణ, వివిధ విభాగాల నాయకులు అడపా సత్యప్రసాద్, శ్రీధర్, శ్రావణి, శ్రీనివాసరావు,శంకర్ పాల్గొన్నారు.

సూర్యబలిజ సంఘం ఆధ్వర్యంలో..

సూర్యబలిజ సంఘం అధ్యక్షుడు భాస్కర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో అమలాపురం చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మాజీ చైర్మన్ చిక్కాల గణేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి తుమ్మిడి శ్రీనివాసరావు, అమ్ముల రవికాంత్, భాస్కర్ల సుబ్రహ్మణ్యం, దాసరి వెంకటరమణారావు, మద్దుల అనురాజేశ్వరి, కాలే సుందరావు తదితర ప్రముఖులు హాజరయ్యారు. శాస్త్రోక్తంగా పూజల అనంతరం పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంఘ ప్రతినిధులు మద్దుల గోపాలకృష్ణ, కాలే గోవిందరాజులు, కాలే సత్తిబాబు, కాలే సురేష్, యండమూరి శివకేశవ్, పందిరి వాసు, ధరణికోట శ్రీనివాస్,భాస్కర్ల రవితేజ పాల్గొన్నారు.



అమలాపురంలో కార్తీక వనసమారాధనలో ఆటల పాటలు

గౌడ సంఘం ఆధ్వర్యంలో..

అమలాపురం పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీరామపురంలో నిర్వహించిన కార్తీక వనసమారాధనకు సంఘీయులు వందలాదిగా హాజరయ్యారు. విచిత్ర వేషధారణలు, సాంస్కృతిక పోటీలతో పాటు పలుకార్యక్రమాలను గౌడ సంఘ అధ్యక్షుడు మట్ట రవికిశోర్, కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గౌడుల మూల పురుషుడు కౌండిన్యమహర్షి పూజ నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్‌శంకర్‌గౌడ్ కార్తీక మాస విశిష్టతపై ప్రవచనం చేశారు. సంఘ ప్రముఖులు వెలిగట్ల రామలక్ష్మణరావు, వీరిన సాయిరామ్, రాజులపూడి భీముడు, రేలంగి దుర్గారావు, అయినవిల్లి నాగేంద్రకుమార్, మట్ట మహేష్, వెలిగట్ల జగదీష్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

అంతర్వేది ఆలయంలో భక్తుల సందడి

అంతర్వేది, నవంబరు9(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. వేకువజాము నుంచి కార్తీక మాస పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు తొలి దర్శనంగా క్షేత్ర సంరక్షకుడు పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు, అభిషేకాలు చేశారు. నందీశ్వరుని వద్ద దీపారాధనలు చేశారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధ్వజస్తంభ సమీపంలో ఉన్న వేపచెట్టు వద్ద మొక్కులు చెల్లించుకుని మహిళలు దీపారాధనలు చేశారు. అనంతరం క్యూలైన్‌లో స్వామి దర్శనానికి బారులు తీరారు. కార్తీకమాస ఆదివారం కావడంతో భక్తులు దర్శించుకునే క్యూలైన్, ఆలయ ప్రధాన గోపురం దాటి వెలుపల వరకు సాగింది. భక్తుల రద్దీ మేరకు అన్నదానంలో బఫే సిస్టం ద్వారా ప్రసాదం అందించారు. అయ్యప్ప, భవానీల మాలధారులు అధిక సంఖ్యలో పుణ్యక్షేత్ర ఆలయాలు సందర్శించారు. సాయంత్రం సాగరసంగమం, బీచ్, లైట్‌హౌస్ వద్ద భక్తులు, పర్యాటకులు సందడి చేశారు.



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు

వైద్యశాఖ ఉద్యోగులు సంఘటితం కావాలి



సమావేశమైన వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు

ముమ్మిడివరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఎలైడ్ హెల్త్ జేఏసీ కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. ముమ్మిడివరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, ల్యాబ్‌టెక్నీషియన్లు, ఫార్మాశిస్ట్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం షేక్ మదీనాబాషా అధ్యక్షతన ఆదివారం జరిగింది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేసింది. హక్కుల సాధనకు ఉద్యోగులంతా సంఘటితం కావాలన్నారు. అనంతరం జిల్లా ఎలైడ్ హెల్త్ జేఏసీ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. జిల్లా కన్వీనర్‌గా గూటం అరుణకుమారి, కోకన్వీనర్‌గా నక్కా శ్రీనివాస్, గాలిదేవర శ్రీహరి, సెక్రటరీగా షేక్ మదీనాబాషా, జాయింట్ సెక్రటరీగా ఉందుర్తి అచ్యుతవల్లీ, దుగ్గిరాల సుగుణాలక్ష్మి, పసుపులేటి మాణిక్యాంబ, ట్రెజరర్‌గా పెంటపాటి సూర్యనారాయణలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురుఅభినందించారు. సమావేశంలో టి.చాందనీ, సునంద, విజయలలిత, రాజీవ్, త్రినాథ్, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో లక్ష బిల్వార్చన

మామిడికుదురు, నవంబరు9(ఆంధ్రజ్యోతి): పరమేశ్వరునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీకమాసంలో నిర్వహించే లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాన్ని భక్తులు మామిడికుదురు, పాశర్లపూడి గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. మామిడికుదురులో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో నయినాల తమ్మారావు దంపతుల ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన ఘనంగా జరిపారు. దీనిలో భాగంగా విఘ్నేశ్వరపూజ, రామలింగేశ్వరస్వామికి పంచామృతాలతోఅభిషేకాలు, పార్వతీదేవికి లక్ష కుంకుమార్చన, చండీ హోమం, రుద్ర హోమం తదితర పూజా కార్యక్రమాలను పలువురు భక్త దంపతులు కర్తలుగా పాల్గొని ఘనంగా చేశారు. అనంతరం తమ్మారావు ఇంటి వద్ద జరిగిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. పాశర్లపూడి బాడవలోని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన ఘనంగా చేశారు. మొగలికుదురులోని భద్రకాళీసమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వనసమారాధనలో భక్తులు పాల్గొనిఉసిరి చెట్టుకు పూజలుచేసి అన్నప్రసాదం స్వీకరించారు.

వేడుకగా శివపార్వతుల కల్యాణం

అమలాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండలం ఇందుపల్లి అరవగరువులో శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణం శ్రీబాలభక్తగణపతి సేవాసంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగింది. గంటి సూర్యభాస్కరం-విశాలి దంపతులు కర్తలుగా శివపార్వతల కల్యాణ వేడుకలు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అరవగరువులో అత్యంత ఘనంగా జరిగింది. వేద పండితులు వారణాశి నాగవెంకటమాధవలక్ష్మీనరసింహమూర్తి బ్రహ్మత్వంలో పండితులు కల్యాణ క్రతవుతు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటుచేశారు. అనంతరం దీపోత్సవంలో భక్తులు వందలాదిగా పాల్గొన్నారు. కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీబాలభక్త గణపతి సేవా సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేడుకగా శెట్టిబలిజ వనసమారాధన



అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు

అమలాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ కులస్థులంతా రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉండాలని పలువరు వక్తలు పిలుపునిచ్చారు. అమలాపురం పట్టణంలోని వనచర్ల గార్డెన్‌లో ఆదివారం జరిగిన శెట్టిబలిజ సమారాధనలో భారీ సంఖ్యలో సంఘీయులు హాజరయ్యారు. తొలుత ఉసిరి చెట్టు వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి శెట్టిబలిజ నేతలు తరువాత పెద్దలతో సమావేశం నిర్వహించారు. పిల్లలతో ఆటాపాట కార్యక్రమాలు చేపట్టారు. ఈసమారాధన కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, ఆహ్వాన కమిటీ చైర్మన్ మట్టపర్తి మీరాసాహెబ్ శెట్టి, కుడుపూడి సూర్యనారాయణ, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పితాని బాలకృష్ణ, పెచ్చెట్టి చంద్రమౌళి, యిళ్లశేషగిరిరావు, కుడుపూడి భరత్‌భూషణ్-సత్యశైలజ, కుడుపూడి బాబు, ఎంపీపీలు యిళ్ల శేషారావు, కుడుపూడి భాగ్యలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, సంసాని నాని, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, వాసర్ల వెంకన్నతో సహా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అనేకమంది శెట్టిబలిజ సమారాధనలో పాల్గొన్నారు. వివధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులను సంఘ నాయకులు దుశాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

యానాం కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జిగా రామ్మూర్తి



యానాం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 30 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ పుదుచ్చేరి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత లోక్‌సభ ఎంపీ వి.వైద్యలింగం ఉత్తర్వులు జారీ చేశారు. యానాం కాంగ్రెస్ నాయకుడు కాటంశెట్టి రామ్మూర్తిని యానాం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించారు.

పురోహితుడికి సాయం

పి.గన్నవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మానేపల్లిలోదసరా ఉత్సవాల్లో భాగంగా జరిగిన బాణసంచా పేలుడులో గాయపడిని పురోహితుడు పెద్దింట్ల గోపికి మానేపల్లి ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం పరామర్శించారు. అసోసియేషన్ ఉద్యోగులు రూ.25వేలు అందించారు.

గొల్లపల్లికి మోషేన్‌రాజ్ పరామర్శ



అమలాపురం,నవంబరు9(ఆంధ్రజ్యోతి): హృదయ సంబంధ సమస్యతో అమలాపురంలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజోలు నియోజకవర్గ వైసీపీ కోర్డినేటర్, మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావును ఆదివారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజ్ పరామర్శించారు. కిమ్స్‌లో చికిత్స పొందుతున్న గొల్లపల్లిని పలకరించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గొల్లపల్లి సూర్యారావు సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి మళ్లీ నియోజకవర్గంలో ప్రజలు, పార్టీ శ్రేణులతో మమేకమవుతారని మోషేన్‌రాజ్ ఆకాంక్షించారు. చైర్మన్ వెంట ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, రాష్ట్ర వైసీపీ కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్ ఉన్నారు.

తాటిపాక నుంచి అప్పనపల్లి వరకు పాదయాత్ర

మామిడికుదురు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గోవింద మాల ధరించిన 60మంది భక్తులు మాలధారులు తాటిపాక గ్రామం నుంచి అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయానికి ఆదివారం పాదయాత్రగా వచ్చారు. తాటిపాకలోని గోవిందస్వాముల పీఠానికి చెందిన అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, పట్నాల దత్తాత్రేయ, గురుగోవిందుల ఆధ్వర్యంలో జరిగిన పాదయాత్రకు ఆలయ ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. మాలధారులు బాలబాలాజీస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో గోవిందనామ పుస్తకాలను శృంగవృక్షం దత్త పీఠాధిపతి సాయిదత్త నాగానంద సరస్వతీ స్వామిజీ ఆవిష్కరించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

అంబాజీపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కె.పెదపూడి పరిధి తిరుమనాథంవారిపాలెం శివారులో ఆదివారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. రూ.14లక్షలకు పైగా ఆస్తినష్టం ఏర్పడింది. బాధిత కుటుంబాలనుఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వం తరపున బియ్యం, నిత్యావస రాలు అందించారు. అంబాజీపేట భవాని సేవా సమితి ఆధ్వర్యంలో గురుభవానీలు దంగేటి సాయిబాబు, మల్లేశ్వరి, మట్టపర్తి ఏసు, మట్టపర్తి శ్రీనివాస్, పాటి శేఖర్, గుత్తుల పండు, పితాని శ్రీనులు బాధితులకు 50కిలోల బియ్యం, చీరలు పంపిణీ చేశారు. దాసరి వీరవెంకట సత్యనారాయణ, పెదపూడి శ్రీనివాసరావు, మందా రాజేష్, దొమ్మేటి సురేష్, తిరుమనాధం హనుమంతరావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

కార్తీక వనసమారాధన

పి.గన్నవరం శ్రీబాలాత్రిపురసుందరీ గరుడేశ్వరస్వామి వార్ల ఆలయ సన్నిధిలో ఆదివారం కార్తీక వనసమారాధన జరిగింది. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నసమారాధనలో పాల్గొని స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు.

శెట్టిబలిజలు ఐక్యంగా అన్నిరంగాల్లో రాణించాలి

రాజోలు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజలు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో ఉన్నతి సాధించాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. తాటిపాక సెంటర్‌లో శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. అక్కడి నుంచి పొదలాడ జీఎస్ గార్డెన్స్ వరకు శెట్టబలిజ నాయకులతో ర్యాలీగా తరలివెళ్లారు. అనంతరం రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధనలో పాల్గొన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం తాటిపాక సెంటర్‌లో వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం శెట్టిబలిజ కార్తీక వనసమారాధనలో పాల్గొన్నారు. తొలుత ఉసిరి చెట్టుకు సుభాష్, రెడ్డి సుబ్రహ్మణ్యం పూజలు చేశారు. ఈసందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాజోలు, పి.గన్నవరం, మామిడికుదురు, సఖినేటిపల్లి మండలాల నుంచి శెట్టిబలిజ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, శెట్టిబలిజ సంక్షేమ సంఘం రాజోలు తాలూకా అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణమూర్తి, పెచ్చెట్టి చంద్రమౌళి, టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, రాజోలు ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి, రాజోలు ఎంపీపీ కదలి శ్రీదుర్గ, పెచ్చెట్టి మురళీకృష్ణారెడ్డి, సెక్రటరీ కాండ్రేగుల రాము, ట్రెజరర్ బొక్కా వీరవెంకటేశ్వరరావు, గుబ్బల శ్రీనివాస్, అనుచూరి పురుషోత్తం, గుబ్బల మనోహర్, చెల్లుబోయిన పెద్దిరాజు, కాండ్రేగుల కృష్ణ, గుబ్బల బాబ్జి పాల్గొన్నారు.



తాటిపాకలో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

హిందూ ధర్మ పరిరక్షణలో అర్చక పురోహితులు మూలస్తంభాలు



ఆర్ఎస్ఎస్ ప్రతినిధుల సమావేశం

ఐ.పోలవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): హిందూధర్మ పరిరక్షణలో అర్చక పురోహితులు మూలస్తంభాలుగా నిలుస్తారని ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు అన్నారు. మురమళ్ళ వీరేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం ఆర్ఎస్ఎస్ సమావేశం జరిగింది. ఈనెల14న ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగే అర్చక పురోహితుల సమావేశాన్ని విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. రాబోయే కాలంలో హైందవధర్మ పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, నిర్ణయాల గురించి జాగృతం చెయ్యడానికి ఆంధ్రప్రదేశ్ సహ ప్రాంత ప్రచారక్ జనార్ధన్ హాజరవుతున్నట్టు ప్రతినిధులు తెలిపారు. ఈసమావేశంలో ముమ్మిడివరం సంఘ సంచాలకుడు పెన్మెత్స గోపాలకృష్ణంరాజు, విభాగ ప్రచారక్ సోము, జిల్లా కార్యనిర్వాహక్ అడపా రమణ, బులుసు జగదీష్, సలాది శ్రీనివాసరావు, బి.కనకారావు, ఏలూరి రాంబాబు, నాగభట్ల రవిశర్మ, ఉండి దత్తుశర్మ, గంటి సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సత్యాగ్రహ దీక్ష



మున్సిపల్ కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న సత్తిబాబు

అమలాపురంటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులను తిరిగి వెంటనే విధుల్లోకి తీసుకుని బకాయి వేతనాలను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తూ అమలాపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. నాన్ పీహెచ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. దీక్షా శిబిరం ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొప్పుల సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించగా ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వాసంశెట్టి సత్తిరాజు తదితర ప్రముఖులు సందర్శించ సంఘీభావం తెలిపారు. తొలగించిన పారిశుధ్య కార్మికులను వెంటే విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు.సీఐటీయూ అధ్యక్షుడు తొమ్మండ్రు గోపి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనయన్ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ కొప్పుల బాబి, సీఐటీయూ ఉపాధ్యక్షుడు నక్కా నరసింహమూర్తి, చోడే రాంబాబు, కానేటి సుమన్, కానేటి వెంకట్రావు పాల్గొన్నారు.

కుండలేశ్వరుని దర్శించుకున్న మంత్రి సుభాష్



కాట్రేనికోన, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం కుండలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కూటమి పాలనలో ఆలయాల్లో వసతులతో పాటు ప్రసాదం నాణ్యత పెరిగిందన్నారు. రాష్ట్రాన్ని ఏ సైకో కళ్ళు పడకుండా రక్షించాలని స్వామిని కోరుకున్నట్టు మంత్రి తెలిపారు. కాశీ వెళ్లే ముందు కుండలేశ్వరం రావాలని ఇక్కడికి వచ్చిన తర్వాత తనకు తెలిసిందని మంత్రి వ్యాఖ్యానించారు. తొలుత ఆలయ అధికారులు, అర్చకులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు.

రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా చినబాబు

మలికిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా లక్కవరానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ముదునూరి వేణుగోపాలకృష్ణంరాజు (చినబాబు) ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతిలో జరిగిన కార్యక్రమానికి రాజోలు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై ఆయన్ను అభినందించారు. టీడీపీ రాజోలు ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ భూపతిరాజు సాయిబాబు, మద్దాల పెద్దకాపు, చింతా వీరభద్రేశ్వరరావు, అడబాల సాయిబాబు, గోనిపాటి రాజు, అనుచూరి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్‌పైప్‌లైన్ బాధితులకు పరిహారం ఇప్పించండి

● కాకినాడ కలెక్టర్‌ను కోరిన మల్లాడి



యానాం,నవంబరు9(ఆంధ్రజ్యోతి): సముద్రంలో ఆయిల్, గ్యాస్ వెలికితీస్తున్న చమురు సంస్థల నుంచి ప్రజలకు రక్షణతో పాటు నష్టపరిహారం అందించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతనిధి మల్లాడి కృష్ణారావు కోరారు. కాకినాడ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలెక్టర్‌ను మల్లాడి కలిసి వినతిపత్రం అందజేశారు. సముద్రం నుంచి యానాం లోని ఐలాండ్ నెంబరు 3మీదుగా వెళ్లిన గ్యాస్ పైప్‌లైన్ లీక్‌కు సంబంధించి మత్స్యకారులతో పాటు ఇతర వర్గాల వారికి నష్టపరిహారం, భవిష్యత్‌లో చమురు సంస్థల చర్యల నుంచి యానాం ప్రజలకు రక్షణ తదితర అంశాలపై చర్చించారు. దరియాలతిప్ప, గాడిమొగ, మల్లవరం తదితర గ్రామాల ప్రజలు వివరించిన సమస్యలపై చమురు సంస్థలతో మాట్లాడాలని కలెక్టర్‌ను కోరారు. ఈనెల14న కలెక్టర్ అధ్యక్షతన చము రు సంస్థల ప్రతినిధులతో సమావేశం జరగనుందని మల్లాడి తెలిపారు.

సామాజిక సేవకుడు లక్ష్మణరావుకు డాక్టరేట్

మామిడికుదురు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):సామాజిక సేవకుడు, నగరానికి చెందిన అప్పారి లక్ష్మణరావుకు ఈపీబీ యూనివర్శిటీ వారు డాక్టరేట్‌ను అందించారు. విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీలో వందన యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కరోనా సమయంలో చేసిన సేవలకు అవార్డును అందించారు. లక్ష్మణరావును ఆదివారం పలువురు సత్కరించారు.

శివయ్య పెళ్లి కొడుకాయెనే..



శివపార్వతులను కల్యాణమూర్తులుగా తీర్చిదిద్దుతున్న భక్తులు

అమలాపురంరూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల దివ్య కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం శ్రీభువనేశ్వరి అమ్మవారిని పెండి కుమార్తెగా, త్రయంబకేశ్వరస్వామివారిని పెండ్లికుమారుడిగాను గ్రామానికి చెందిన లక్కింశెట్టి ప్రకాష్, చింతా మల్లికార్జునరావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. దైవపు కోటేశ్వరరావు దంపతులు అమ్మవారికి సారె సమర్పించారు. చింతా అత్తిలింగం కుటుంబ సభ్యులచే పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరిపించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. సాంప్రదాయ బద్ధంగా మహిళలు కాళ్లకు పారాణి రాసుకుని పసుపు పోటువేసి శనగలు పంపిణీ చేశారు. శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి-చంద్రకళ, చింతా ఉమా, గోళ్ల మల్లేశ్వరరావు, యినుమర్తి లింగమూర్తి, పిచ్చిక కోటేశ్వరరావు, కొండా చంటి పాల్గొన్నారు.

కుంగిన ఆర్అండ్‌బీ రహదారి



పి.గన్నవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పి.గన్న వరం పంచాయతీ రోడ్డులో రాజులపాలెం సమీపంలో గోరింకల డ్రైన్ వంతెన వద్ద ఇటీవల కొంతమేర ఆర్అండ్‌బీ రహదారి కుంగిపోయింది. ఇప్పటికే డ్రైన్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి పిల్లర్లు డ్రైన్‌లో ఒక ప్రక్కకు కుంగి పోయాయి. రక్షణ గోడలు బీటలువారి పడిపోయాయి. డ్రైన్ వెంబడి భూమిని పటిష్టం చేసి కుంగిన రోడ్డును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈలోపు ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రూ.3లక్షల చెక్కు అందించిన యూటీఎఫ్

మామిడికుదురు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెపోటుతో ఉపాధ్యాయుడు కాగితాలపల్లి నరసింహారావు మృతి చెందగా ఆ కుటుంబానికి యూటీఎఫ్ సంక్షేమ పథకం కింద రూ.3లక్షల చెక్కును ఆదివారం యూటీఎఫ్ ప్రతినిధులు అందించారు. యూటీఎఫ్ సంఘం కోసం నరసింహారావు ఎంతో సేవ చేశారని కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి చెల్లుబోయిన కేశవరావు, జిల్లా కార్యదర్శి బేతినీడి శ్రీనివాసరావు, జి.నాగేంద్రప్రసాద్, కె.సత్యనారాయణ, ఎ.కొండయ్య, కేఎస్వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా ఉద్యమాన్ని' విజయవంతం చేయండి

పి.గన్నవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రజా ఉద్యమం పేరిట ఈనెల12న పి.గన్నవరంలో చేపట్టే నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పోతవరం పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ప్రజా ఉద్యమం గోడపత్రికను ఆయన ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. మందపాటి కిరణ్‌కుమార్, దొమ్మేటి శివరామన్, వడలి కొండయ్య, కొంబత్తుల ఏసు, దేశరాజు సీతారామయ్య(సాయి), అడ్డగళ్ల శ్రీను పాల్గొన్నారు.

హనుమంతరావుకు ఆచార్య దేవోభవ పురస్కారం

ముమ్మిడివరం, నవంబరు9(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి చేస్తున్న కృషికి ముమ్మిడివరం జడ్పీ బాలుర ప్రధానోపాధ్యాయుడు బీర హనుమంతరావుకు ఆచార్యదేవోభవ పురస్కారం లభించింది. కాకినాడలో జరిగిన చేయూత స్వచ్ఛంద సంస్థ 8వవార్షికోత్సవంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ చేతులమీదుగా హనుమంతరావు అవార్డును అందుకున్నారు. చేయూత స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, రవి పాల్గొన్నారు.

శివాలయాల్లో ఆరుద్ర నక్షత్ర పూజలు

అంబాజీపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆరుద్ర నక్షత్ర సందర్భంగా మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 450ఏళ్ల చరిత్ర కలిగిన ఏకాదశ రుద్రులను అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. ఈసందర్భంగా స్వామివార్లకు మహాన్యాస పూర్వక లఘు రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, గణపతి రుద్రహోమాలు, చండీపారాయణ, పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు.

వైభవంగా లక్ష బిల్వార్చన, కుంకుమార్చన



ఉప్పలగుప్తం, నవంబరు9(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లిశ్రీమాణిక్యాంబ సహిత భీమేశ్వరస్వామికి ఆదివారం ఆలయ కమిటీ, గ్రామస్తులు, దాతల సహకారంతో లక్ష బిల్వార్చన, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కుంకుమార్చనలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు భైరవబొట్ల వెంకటసుబ్రహ్మణ్యం(నాని), కార్తికేయశర్మ పర్యవేక్షణలో పుల్లేటికుర్తి గౌరీశంకర్ బ్రహ్మత్వంలో పూజాకార్యక్రమాలు జరిగాయి. సలాది గంగారాజు, సత్తిబాబు మధ్యాహ్నం భక్తులకు అల్పాహారం ఏర్పాటుచేశారు. సాయంత్రం కొప్పిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. గ్రామపెద్దలు, యువత ఆలయం వద్ద భక్తులకు సేవలందించారు.

కులవృత్తులకు గుర్తింపు ఇస్తున్న కూటమి ప్రభుత్వం

మామిడికుదురు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమిప్రభుత్వం కులవృత్తులు చేసుకునే వారికి గుర్తింపు ఇస్తుందని శాలివాహన సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్ పేరేపి పేర్కొన్నారు. ఆదివారం ఆయన బి.దొడ్డవరం కుమ్మరిపాలెంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కుమ్మరి వృత్తి చేసుకునే వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. రాష్ట్రంలో పది లక్షలకు పైబడి శాలివాహనలు ఉన్నారని, వారికి ప్రభుత్వం గుర్తింపు ఇచ్చి 50ఏళ్లు పైబడిన వారందరికీ పెన్షన్లు ఇవ్వాలని కోరారు. మట్టి తీసుకుని కులవృత్తి చేసుకునేందుకు శాలివాహనులకు ఏవిధమైన ఇబ్బంది లేకుండా ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. చైర్మన్‌ను స్థానిక శాలివాహన యూత్ సభ్యులు దుశ్శాలువాలు, పూలమాలతో సన్మానించారు.

సత్యసాయిబాబా శతజయంతి వేడుక

అల్లవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి శ్రీసత్యసాయిబాబా వందవ జయంతి సందర్భంగా ఆదివారం కొమరగిరిపట్నం సత్యసాయి సేవాసదన్‌లో 24గంటల అఖండ నామసంకీర్తన జరిగింది. స్వామివారికి అభిషేకాలు, నగరసంకీర్తనలు, గీతాలాపనలు జరిగాయి. నవంబరు23న సత్యసాయి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి నిర్ణయం పట్ల భక్తులు హర్షం వ్యక్తంచేశారు. సమితికన్వీనర్ ఎన్.శ్రీనివాసరాజు, బాలవికాస్ కోఆర్డినేటర్ సుబ్బలక్ష్మి, గుర్రం అన్నవరం, పోచినపెద్ది వెంకటేష్, పిండి గణపయ్య, దాట్ల రంగరాజు, మొగళ్లమూరి సాయిబాలవికాస్ పాల్గొన్నారు.

ఘనంగా ఆరుద్ర పూజ

కాట్రేనికోన, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చెయ్యేరులో శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లక్షపత్రి పూజ నిర్వహించారు. నడింపల్లి సూర్యనారాయణరాజు(సూరిబాబు), సుభద్ర దంపతుల ఆధ్వర్యంలో పూజ జరిగింది. 15మంది రుత్విక్కులు పూజాకార్యక్రమంలో పాల్గొన్నారు. పూజ అనంతరం అన్నసమారాధన జరిగింది.

వీరేశ్వరునికి రుద్రహోమం

ఐ.పోలవరం, నవంబరు9(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ శ్రీభద్రకాళీసమేత వీరేశ్వరస్వామికి ఆదివారం రుద్రహోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, రుద్ర హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఏర్పాట్లను ట్రస్టుబోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం


కపిలేశ్వరపురంలో వనసమారాధన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

ఐకమత్యానికి ప్రతీకలుగా కార్తీక వనసమారాధనలు

● ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

కపిలేశ్వరపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఐక్యమత్యానికి ప్రతీకలుగా కార్తీకవనసమారాధనలు నిలుస్తాయని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని కపిలేశ్వరపురం, మాచర, టేకి గ్రామాల్లో నిర్వహించిన కార్తీక వనసమారాధన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కపిలేశ్వరపురంలో దివాణం ఆడిటోరియంవద్ద గ్రామ నాలుగు శెట్టిబలిజ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వనసమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్లకు శెట్టిబలిజ సంఘీయులు పలు సమస్యలను విన్నవించారు. గతంలో ఇచ్చిన హామీమేరకు గ్రామంలో శెట్టిబలిజ కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తిచేయాలని ఎమ్మెల్యే వేగుళ్లను కోరగా అది పూర్తిచేసిన తరువాతే మీ వద్దకు ఓటు అడిగేందుకు వస్తానని ఆయన తెలిపారు. అలాగే కపిలేశ్వరపురం-అంగర ఆర్అండ్‌బీ రహదారి ప్రయాణం నరకంగా మారిందని సమస్యను పరిష్కరించాలని కోరారు. వనసమారాధన కార్యక్రమాన్ని జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు ప్రారంభించారు. సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేగుళ్ళ, జడ్పీటీసీ అబ్బు, చిట్టిబాబులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ పువ్వల చిట్టిబాబు, ఎంపీటీసీ శీలం భాస్కరరావు, నేలటూరు, నల్లూరు సర్పంచ్ కుక్కల వీరన్న, శెట్టిబలిజ నాలుగు సంఘాల అధ్యక్షులు కుడుపూడి సురేష్, జుత్తుగ మల్లిఖార్జునుడు, పితాని సూర్యచంద్రరావు, కొప్పిశెట్టి వాసు, కాద రాంబాబు, ముషిణి వెంకటరమణ, సీహెచ్ నాగేంద్రప్రసాద్, కట్టా మురళి, గుత్తుల శివశ్రీనివాస్, కేతిన చిన్న, పంపన శ్రీనివాస్, తదితరులు శెట్టిబలిజ సంఘీయులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అముజూరులో ..

కె.గంగవరం, నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అముజూరు గ్రామంలో ఆదివారం కళాకారులు కార్తీక వనసమారాధన నిర్వహించారు. లక్ష్మీగణపతి డ్రామా, మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ వారు దీనిని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన కళాకారులు జమ్మి చెట్టుకు పూజలు చేశారు. పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధ నిర్వహించారు. ఈకార్యక్రమంలో లక్ష్మీగణపతి డ్రా మా, మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మరివాడ సూర్యనారాయణ (బొజ్జా యి), రాష్ట్ర నాటక కళాపరిషత్ అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ, ఉపాధ్యక్షులు గుర్రాల సత్యనారాయణ, కార్యదర్శి అవసరాల రమణ మూర్తి, కోశాధికారి వాడ్రేవు ప్రసాద్, ద్రాక్షారామ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు నాగిరెడ్డి సతీష్, పలు గ్రామాల నుంచి వచ్చిన కళాకారులు గొర్రెల రాము, ఉమా మహేశ్వరి, తాతారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు పెంకే సాంబశివ రావు,తదితరులు పాల్గొన్నారు.


వెలిచేరు కాపు వనసమారాధనలో మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, సంజీవ్


ఆర్యవైశ్య వనసమారాధనలో పూజలు చేస్తున్న దృశ్యం


రావులపాలెంలోని కార్తీక వనసమారాధనకు హాజరైన సత్తివారి కుటుంబ సభ్యులు

వనసమారాధనలు ఐక్యతకు దోహదం: బండారు శ్రీనివాస్

ఆత్రేయపురం,నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీక వనసమారాధనలు ఐక్యమత్యానికి దోహదపడతాయని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, టీడీపీ యువనేత బండారు సంజీవ్ పేర్కొన్నారు. ఆదివారం ఆత్రేయపురం మండలం వెలిచేరులో నిర్వహించిన కాపు వన సమారాధన కార్యక్రమంలో పాల్గొని మట్లాడారు. సంఘీయులంతా ఐక్యమత్యంగా ఉంటూ సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే లొల్ల లాకులవద్ద ఆర్యవైశ్య సంఘ వనసమారాధనలో ఎమ్మెల్యే తనయుడు సంజీవ్ పాల్గొని ఉసిరిచెట్టు వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని ఉల్లాసంగా.. ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు నిర్వాహకులు అందజేశారు. కూటమినేతలు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

కాకతీయ కమ్మ సామాజిక వర్గం ఆధ్వర్యంలో

అముజూరు గ్రామంలో కాకతీయ కమ్మసామాజిక వర్గం ఆధ్వ ర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో జమ్మిచెట్టుకి పూజలు నిర్వహించి ఆట పాటలతో ఉల్లాసంగా వనసమారాధన జరిగింది. కోనసీమజిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సత్తివారి కార్తీక వనసమారాధన

రావులపాలెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని కాశిరాజుతోటలో సత్తివారి కార్తీక వనసమారాధన కార్యక్రమం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అక్కడ ఉన్న ఉసిరిచెట్టు వద్ద పూజలు నిర్వహించి అనంతరం వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.వెంకట సత్యనారాయణ రెడ్డి, ఎస్.సూర్యభాస్కరరెడ్డి, ఎస్.శ్రీనివాసరెడ్డి, ఎస్.ఉదయభాస్కరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎస్.శంకర రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

పుణ్యక్షేత్ర దర్శనాలకు ఆర్టీసీ బస్సులు


రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పుణ్యక్షేత్రాల దర్శనాలకు బయలుదేరుతున్న ఆర్టీసీ బస్సులు

రావులపాలెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస పర్వదినాలను పురస్కరించుకుని రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి పుణ్యక్షేత్రాల దర్శనాలకు ఆర్టీసీ బస్సులు బయలుదేరి వెళ్లినట్లు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. జిల్లా పుణ్యక్షేత్ర దర్శనయాత్రకు మూడు సూపర్ లగ్జరీ, ఉత్తరాంధ్ర క్షేత్ర దర్శనానికి ఒక బస్సు, పంచారామాలకు ఒక బస్సు ఆదివారం బయలుదేరి వెళ్లినట్లు డీఎం తెలిపారు.

వెంకన్న ఆలయంలో కార్తీక సందడి


వాడపల్లి విశ్వేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం, వేంకటేశ్వరస్వామి ఆలయంలో పోటెత్తిన భక్తజనం

ఆత్రేయపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక ఆదివారం వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. తిరువీధులలో స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణలు నిర్వహించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అన్నపూర్ణసమేత శ్రీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అశేష భక్తజనం స్వామివారిని దర్శించుకున్నారు. వేలాది మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయం, ఉమాకమండలేశ్వరస్వామి ఆలయాల్లో భక్తజనం పోటెత్తారు.

యండగండి శివాలయంలో లక్షపత్రి పూజ


యండగండిలో సోమేశ్వరస్వామికి పత్రి పూజచేస్తున్న అర్చకస్వామి

కె.గంగవరం, నవంబరు9(ఆంధ్రజ్యోతి): యండగండి గ్రామంలోని రాజరాజేశ్వరి సమేత సోమేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం లక్షపత్రి పూజచేశారు. స్వామివారి జన్మ నక్షత్రం అయిన ఆరుద్ర నక్షత్ర సమయంలో ప్రతీ సంవత్సరం స్వామివారికి లక్ష బిల్వార్చన చేశారు. ఆదివారం స్వామివారికి ఉదయం మహాన్యాసపూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకం, సూర్యనమస్కారాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు కొత్తలంక నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేదపండితులు గోవిందరాజుల నాగఫణిశర్మ బ్రహ్మత్వంతో రుత్వికులు శాస్త్రోక్తంగా లక్షబి ల్వార్చన చేశారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

పసలపూడిలో ఆరుద్ర నక్షత్ర పూజలు


పార్థివలింగానికి పూజలు చేస్తున్న దృశ్యం

రాయవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ఆదివారం పార్థివ లింగాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు పరిటాల శ్రీనివాసశర్మ, పరిటాల కేదార సత్య కుమార నాగఫణి శర్మల అర్చకత్వంలో తొలుతగా వినాయక పూజ, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్రనామార్చన తదితర పూజలు చేశారు. అనంతరం పార్థీవ లింగాలకు భక్తులచే ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం పార్థివ లింగాలకు గ్రామోత్సం నిర్వహించి జల నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం మాణిక్యాంబ సమేత బీమేశ్వరస్వామికి కల్యాణం జరిపారు. ఈకార్యక్రమంలో పారిశ్రామికవేత్త చింతా సుబ్బారెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి వీరరాఘవరెడ్డి , భక్తులు పాల్గొన్నారు.

జనార్ధనస్వామి ఆలయానికి భక్తుల తాకిడి


ఆలమూరు జనార్ధనస్వామి ఆలయానికి విచ్చేసి భక్తులు

ఆలమూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గోదావరి తీరంలో ఉన్న నవజనార్ధనస్వామి ఆలయాల సందర్శనకు ఆదివారం హైదరాబాద్, ఉత్తరాంధ్ర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కార్తీకమాసం సందర్భంగా ఆలమూరు మండలంలో ఉన్న నవజనార్ధన ఆలయాలు ఆలమూరు, జొన్నాడ, మడికి గ్రామాలలో ఉన్న ఆలయాలకు ప్రత్యేకవాహనాలలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆల మూరులో ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు, పలు సభ్యులు వారికి స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు అంగర భగవాన్ ప్రత్యేకపూజలు చేశారు.

ఘనంగా మహాపడిపూజ

కపిలేశ్వరపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగరలో అయ్యప్పస్వాములు స్వామివారికి మహాపడిపూజ, లక్షబిల్వార్చన, అభిషేకాలు, పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామికి అభిషేకా లు, ప్రత్యేక పూజలు, లక్షబిల్వార్చన, మహాపడిపూ జలను భక్తిశ్రద్ధలతో చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులతోపాటు అయ్యప్ప స్వామి మాలధారులు పాల్గొన్నారు.

ర్యాలిలో ట్రాఫిక్ ఇక్కట్లు


ఇరుకురోడ్డులో ఇబ్బందులుపడుతున్న వాహనదారులు

ఆత్రేయపురం,నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి వివిధ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ ఆలయానికి వెళ్లే మార్గం ఇరుకుగా ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం టూరిస్టు బస్సుల ద్వారా ఈ క్షేత్రానికి భక్తులు వస్తున్నారు. ర్యాలి వంతెన నుంచి ఆలయం వరకూ రోడ్డు ఇరుకుగా మారడంతో వాహనాలు ట్రాఫిక్ వ్యూహంలో చిక్కుకుంటున్నాయి. రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగించి వెడల్పు చేయ్యడంతో పాటు శిథిలావస్థలో ఉన్న వంతెనను పునర్నిర్మించాలని ఆలయంవద్ద భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

పీఎం ఆవాస యోజనకు దరఖాస్తు చేసుకోండి

కొత్తపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నేరవేరేందుకు పీఎం ఆవాస యోజన పథకం దరఖాస్తు చేసుకునేందుకు నవంబరు 30వరకూ గడువు పొడగించిందని లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం కోరారు. ఆదివారం ఆయన ఓ ప్రకటనను విడుదల చేస్తూ సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకోవాలనే పేదలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన లబ్ధిదారులు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సత్యానందం కోరారు.

స్థలం వివాదంపై ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత

● పోలీసుల రంగప్రవేశంతో సద్దుమణిగిన వివాదం


స్థలవివాదంపై రెండువర్గాల మధ్య ఉద్రిక్తత తలెత్తిన దృశ్యం

ఆత్రేయపురం, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం గ్రామంలో స్థలవివాదంపై రెండు వర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగింది. రెండువ ర్గాలు బాహబాహీకి తలపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. రూరల్ సీఐ విద్యాసాగర్ ఆధ్వ ర్యంలో ఎస్ఐ ఎస్. రాము సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టడంతో వివాదం సద్దుమణిగింది. వివరాలు ఇలాఉన్నాయి. ఆత్రేయపురం పెద్దరామాలయంపక్కన ఉన్న స్థలంలో పెన్సింగ్ తొలగించే ప్రయత్నం చేపట్టడంతో వివాదం చెలరేగింది. రోడ్డు మార్గాన్ని ఆక్రమించుకున్నారని ఒకవర్గం, తమ స్థలంలో పెన్షింగ్ తొలగించారంటూ మరో వర్గం ఘర్షణకు దిగారు. ఈస్థలంపై తమకు పూర్తి హక్కులు ఉన్నాయని కొందరూ రౌడీలను తీసుకువచ్చి తమ స్థలంలో పెన్షింగ్‌ను దౌర్జన్యంగా తొలగించారంటూ వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకట్రాజు తెలిపారు. ఈ స్థలం రోడ్డుమార్గంలో ఉండే దని మరో వర్గం ఆరోపిస్తున్నారు. ఈ స్థలంపై మరో వర్గం కోర్టుకు వెళ్లారు. దీనిపై ఇరువర్గాలు దాడులు చేసుకునేందుకు ఒకానొక దశలో బాహబాహీకి దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో సమస్య సద్దుమణిగింది.

ఫెన్సింగ్ తొలగించిన వ్యక్తిపై కేసు నమోదు

ముదునూరు రామభద్రరాజుకు చెందిన స్థలంలో చుట్టూ వేసిన ఫెన్షింగ్‌ను తొలగించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెన్షింగ్‌ను ఆదివారం అల్లూరి ప్రసాదరాజుకు చెందిన వర్గీయులు దౌర్జన్యంగా స్థలంలోకి ప్రవేశించి పెన్షింగ్‌ను తొలగించారని రామభద్రరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. అల్లూరి ప్రసాదరాజు అనే వ్యక్తి రామాలయం వద్ద దౌర్జన్యంగారోడ్డును అడ్డగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాస్టారు ఆలేటి సింగపూర్ పర్యటన


సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న ఆలేటి దుర్గాప్రసాద్(ఫైల్)

కొత్తపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం అవిడి గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆలేటి దుర్గాప్రసాద్‌కు సెప్టెంబరు 5న గురుపూజోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌చేతులు మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఇలా రాష్ట్ర ఉపాధ్యాయఅవార్డులు అందుకున్న 78 మంది ఉపాధ్యాయులను మంత్రి లోకేశ్ ఈనెల 27 నుంచి డిసెంబరు 2 వరకూ వారంరోజుల పా టు సింగపూర్ పంపించి అక్కడ విద్యావ్యవస్థపై అధ్య యనం చేసి అక్కడ పరిశీలించిన అంశాలను రిపోర్టు రూపంలో సమర్పించాల్సిందిగా ఆదేశాలు ఇచ్చినట్లు మా స్టారు దుర్గాప్రసాద్ తెలిపారు. ఆదేశాలననుసరించి ఈనెల 27న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ బృందం సింగపూర్ పర్యటనకు బయలుదేరనున్నట్లు ఆయన తెలిపారు.

'విజనరీ అంటేనే చంద్రబాబు'

కొత్తపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రగతికి ప్రణాళిక విజనరీ కోసం శ్రమించే నాయకుడు చంద్రబాబునాయుడని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి పేర్కొన్నారు. ఆదివారం కొత్తపేటలో జరిగిన టీడీపీ సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ము ందస్తు జాగ్రతలు తీసుకోవడం, జరిగిన నష్టాన్ని అంచనా వేయడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసిందన్నారు. ఈ సమావేశంలో గనిశెట్టి వీరేష్, కంఠంశెట్టి శ్రీను, పల్లి ఏసు, వాసంశెట్టి సత్యనారాయణ, కడలి భీమా, ముద్రగడ ఫణి, కాసా విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణవాసులు రోడ్డుమీద చెత్తవేస్తే జరిమానా తప్పదు

● కమిషనర్ రంగారావు

మండపేట,నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణం స్వచ్ఛమండపేటగా గుర్తింపు పొందిందని మండపేట మున్సిపల్ కమిషనర్ టీ.వి.రంగారావు చెప్పారు. పట్టణంలో ప్రజలు వ్యాపారస్తులు ఇతరులెవరైనా సరే రోడ్డుపక్కనగాని, ఇళ్లముందుకాని చెత్తవేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మండపేట మున్సిపల్ కమిషనర్ రంగారావు ఆదివారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ తమ మున్సిపాల్టీ ద్వారా పట్టణ ప్రజలకు అందించిన తడి,పొడి చెత్తను వేరుచేసి ఇచ్చేలా అందించిన డబ్బాల్లో చెత్తను వేసి మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది వచ్చినప్పుడు అందజేయాలని కోరారు.

కాజులూరును కాకినాడ జిల్లాలో కొనసాగించాలి

● మంత్రి సుభాష్‌కు జేఏసీ నాయకుల వినతి


మంత్రి సుభాష్‌కు వినతి పత్రం అందచేస్తున్న జేఏసీ నాయకులు

రామచంద్రపురం(ద్రాక్షారామ),నవంబరు9 (ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలాన్ని కాకినాడజిల్లాలోనే కొనసాగించాలని జేఏసీ నాయకులు సీహెచ్‌వీవీ సత్యనారాయణ అలియాస్ బాబి ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. గత ంలో ఎన్నో పోరాటాలు ఫలితంగా కాజులూరు మండలాన్ని కాకినాడజిల్లాలో చేర్చామని పేర్కొన్నారు. ఇప్పుడు ఇదే మండలాన్ని డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో చేర్చే అవకాశం ఉందని వస్తున్న వార్తలతో ప్రజలు అయోమయానికి గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాజులూరు మండలాన్ని కోనసీమ జిల్లాలో చేరిస్తే కాజులూరు మండల ప్రజలు తీవ్రంగా నష్టపోతారని మంత్రి సుభాష్‌కు వివరించారు. కాజులూరు మండలాన్ని కోనసీమ జిల్లాలో కలిపే అంశంపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని మంత్రి సూచించారు. కాజులూరు మండల ప్రజల ఆకాంక్ష మేరకు కాజులూరు మండలాన్ని కాకినాడ జిల్లాలో కొనసాగించాలని ప్రభుత్వానికి నివేదిస్తామని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నారాయణమూర్తి, ఉపాధ్యక్షుడు మేడిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, కుడుపూడి కొండ, వాడపల్లి, వడ్డాది ధరణి, చందాల త్రిమూర్తులు, పేపకాయల నారాయణమూర్తి, బాబ్జి, వనుం వీరబ్రహ్మం, సూరిబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్ల కృషితో

మండపేట రాజమహేంద్రవరంలో వీలీనం


ఎమ్మెల్యే వేగుళ్లను అభినందిస్తున్న గడిసత్యవతి తదతరులు

మండపేట, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): కోన సీమ జిల్లా నుంచి మండపేటను రాజమహేం ద్రవరం జిల్లాలో విలీనం చేయాలన్న కోరికను నిజంచేసిన ఘనత మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకే దక్కుతుందని రాష్ట్ర తూర్పు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి రాం బాబు అన్నారు. మండపేట నియో జకవర్గం ప్రజల ఆకాంక్షను నేరవేర్చిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును పార్టీ కార్యాలయంలో ఆదివారం కలిసి సత్కరించారు. మండపేట విలీనం రాజమహేంద్రవరంలో త్వరలోనే జరుగుతుందని ఎమ్మెల్యేవేగుళ్ల అన్నారు. రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు కర్రి తాతారావు, జొన్నపల్లి సూర్యారావు, మాజీ కౌన్సిలర్ రామన్న, శ్రీను ఉన్నారు.

క్యాన్సర్ బాధితురాలకు సాయం అందజేత

రావులపాలెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న బాధితురాలికి టీమ్ నేనుసైతం సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. రావులపాలానికి చెందిన లింగోలు సత్యవతి క్యాన్సర్‌తో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఆమె పరిస్థితిని టీమ్ నేనుసైతం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులకు తెలిపారు. దీంతో సంస్థ వ్యవస్థాపకుడు అంబటి కిషోర్ విరాళాల ద్వారా వచ్చిన రూ.15వేలు ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో విక్టరీ బద్రీ, అవినాష్‌చౌదరి, కొవ్వూరి రేణుకరెడ్డి, కంఠంశెట్టి దేవి, శ్రీనివాసు, ఆకుల జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహ స్వచ్ఛంద సేవా వార్షికోత్సవం

రాయవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి గ్రామంలో స్నేహా స్వచ్ఛంద సేవా సంస్థ తొలి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ సీనియర్ నాయకుడు ఉండవిల్లి రాం బాబు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి పేదలకోసం స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమన్నారు. ఏడాదికాలంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డి.ఆదిలక్ష్మీ బృందాన్ని పలువురు అభినందించారు. అనంతరం గ్రామానికి చెందిన కొలివెల సత్యనారాయణ కుటుంబానికి నిత్యావసరాలను అందజేశారు.

కేశవరంలో వివాదాస్పదంగా గ్రంథాలయ స్థలం

● గ్రామంలో రెండువర్గాల మధ్య చిచ్చు
● పోలీసు పికెట్ ఏర్పాటు


కేశవరంలో వివాదాస్పదంగా మారిన గ్రంథాలయ స్థలం

మండపేట, నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం కేశవరంలో పంచాయతీకి కూత వేటు దూరంలో వున్న గ్రంథాలయంనకు చెందిన సర్వే నెం.189లోవున్న సెంటు స్థలంలో గ్రంథాలయ ఉండేది. గ్రంథాలయం కూలిపోవటంతో అక్కడ ఉన్న స్థలంలో గ్రామానికి చెందిన ఒక సామాజికవర్గంనకు చెందిన వారు వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ను అయ్యప్ప మాలదారణ భవానీలు మాలదారణ చేసే సమయంలో బిక్షకోసం షెడ్డు వేసుకుంటామని కోరగా ఆయన అనుమతించారు. అప్పటిలో వారు ఇక్కడ షెడ్డు నిర్మించుకోకపోవటంతో స్థలంఖాళీగా ఉంది. అదే స్థలంను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వా త గ్రామానికి చెందిన ఒక సామాజికవర్గం పెరికలు తాము కమ్యూనిటీహాలు నిర్మించుకుంటామని ఎమ్మె ల్యే వేగుళ్లను కలిసి కోరగా ఆయన అందుకు అంగీకారం తెలిపారు. అందుకు పంచాయతీ తీర్మానం తీసుకోవాలని ఆయన వారికి సూచించారు. అదే స్థలంలో శనివారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన కొంతమంది అయ్యప్పస్వామి మాల ధారణలో వున్న స్వాములు వంటషెడ్డు వేసేందుకు ఇనుప స్తంభాలు వేసి షెడ్డు నిర్మాణంకు ప్రయత్నించిన సమాచారంను పంచాయతీ కార్యదర్శి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి షెడ్డు తొలగించేందుకు ప్రయత్నించగా స్వాములు అడ్డుకున్నారు. దేవుళ్ల ఫోటోలతో స్వాములు పోలీసులు తీరుకు నిరసన తెలిపారు. కేశవరంలో గ్రంథాలయ సంస్థకు సంబంధించిన స్థలంను రెండేళ్ల క్రితం అప్పటి వైసీపీ ప్ర భుత్వంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇచ్చినపుడు స్థలంలో నిర్మాణం చేయకపోవటం ఇప్పుడు ఆ స్థలం ఖాళీగా ఉండటంతో అదే స్థలంను మండపేట ఎమ్మె ల్యే వేగుళ్ల ఇప్పుడు వేరే సామాజికవర్గంకు చెందిన వారు కమ్యూనిటీ హాలు నిర్మించుకునేందుకు ఇవ్వటంతో రెండువర్గాల మధ్య వివాదం రాజుకుంది. ప్రస్తుతం ఈ స్థల వివాదం రెండు పార్టీలు టీడీపీ వైసీపీల రంగు పులుముకుంది. పంచాయతీ తీర్మానంచేసి పెరికలకు గ్రంథాలయ స్థలంను అప్పగించాలని కార్యదర్శిని ఆదేశించారు. షెడ్డు నిర్మించి గ్రంథాలయ స్థలంలో వైసీపీ స్థలంలో ఆందోళన చేస్తున్న వారు వైసీపీ శ్రేణులు కాగా, పెరికి సామాజికవర్గంనకు చెందిన వారు టీడీపీవారుగా ఉన్నారు. మొత్తం మీద కేశవరంలో గ్రంథాలయ స్థలంకు చెందిన సెంటు స్థలం చుట్టూ రాజకీయ మంట రాజుకుంది.